క్లుప్తంగా

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మండల పరిధి ముద్విన్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మధు ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఇటీవల దివ్యాంగులు బస్‌పాస్‌లకు దరఖాస్తు చేయగా.. హైదరాబాద్ ఆర్టీసీ డిపో–2 మంజూరు చేసింది. ఈ మేరకు వారు శనివారం దివ్యాంగులకు బస్ పాసులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగి శివరాజ్, నాయకులు శ్రీశైలం, నరేశ్‌గౌడ్, వెంకటేశ్, యాదీలాల్, కొండల్, నర్సింహ పాల్గొన్నారు.

అబుల్ కలాంకు నివాళి



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, అజీం, రవీందర్ యాదవ్, కృష్ణ, ఆరీఫ్, రాములు, రమేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ భక్తుల పడిపూజ



పడిపూజలో శివ భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చంద్రదన హనుమాన్ దేవాలయంలో శనివారం శివ భక్తులు శివ మహాపడిపూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం శివ నామస్మరణతో మార్మోగింది. అనంతరం శివ మాల ధరించిన భక్తులు ఇరుముడులు కట్టుకుని, శ్రీశైలం బయలుదేరారు. అంతకు ముందు భక్తులకు బాలరాజు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన జ్యోతయ్య

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలోని స్వేరో స్టడీ సర్కిల్ సెంటర్‌లో విద్యార్థులకు శనివారం మాజీ సర్పంచ్ జ్యోతయ్య ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వేరో సర్కిల్ నిర్వాహకులు పెరుమాళ్ల సురేశ్, నాయకులు శ్రీను, ఇంద్రయ్య, యాదయ్య, లింగం పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

అబ్దుల్లాపూర్‌మెట్: విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలని టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ ఎస్ఈ మాధవరెడ్డి కోరారు. శనివారం సరూర్‌నగర్ సర్కిల్ పెద్దఅంబర్‌పేట సెక్షన్ పరిధి గౌరెల్లిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బకాయి చెల్లించి, విద్యుత్ సదుపాయాన్ని కొనసాగించుకోవాలని సూచించారు. డీఈ కేకే రామకృష్ణ, ఏడీఈ విజయభాస్కర్, సీనియర్ అకౌంట్స్ అధికారులు రమణారెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడాలి

ఇబ్రహీంపట్నం రూరల్: దేవాదాయ భూములను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఎక్కడ అన్యాక్రాంతం అయ్యాయో గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశించారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం పోచారం– కర్ణంగూడ గ్రామాల మధ్యలో ఉన్న లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ నూతన కమిటీతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతుగా, ప్రభుత్వం తరఫున కృషి చేస్తానని తెలిపారు. 11 ఎకరాల ఆలయ భూమి హద్దులు గుర్తించి, హద్దురాళ్లు ఏర్పాటు చేయించాలని అధికారులకు సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ దాయి నరేష్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, డైరెక్టర్లు సుశీల, కృష్ణగౌడ్, రంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, సీఐ జగదీష్, ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

పురపాలిక పరిధి కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం



కమ్మగూడ లక్ష్మీనగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్యం పడకేసింది. పలు కాలనీలు డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. ఇళ్లమధ్య, రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పేరకుపోయి స్థానికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని, రోడ్డు వెంట నడవలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చెత్త కుప్పలతో పందులు, దోమల బెడద పెరిగిందని కమ్మగూడ లక్ష్మీనగర్ కాలనీ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొందరు చెత్తను చెత్త సేకరించే ఆటోలో వేయకుండా ఇలా రోడ్డుపై పడేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం చెత్త సేకరించే వారు వేళకు రాకపోవడమేనని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం వేళలో త్వరగా వస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అదే విధంగా చెత్త సేకరణ వాహనాల సంఖ్య పెంచేలా పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

సహకరించాలి

పుర ప్రజలు చెత్తను స్వచ్ఛ ఆటోలో వేయాలి. బహిరంగ ప్రదేశాల్లో వేసి పరిసరాల అపరిశుభ్రతకు కారకులుగా మారొద్దు. చెత్తను బయట పారబోస్తే జరిమానా విధిస్తాం. ప్రజలు సహకరించి, స్వచ్ఛ మున్సిపాలిటీలో భాగస్వాములు కావాలి. – ప్రవీణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను భారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శనివారం ఆయన స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేనప్పటికీ.. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు, అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామాలు, తండాలకు బీటీరోడ్లను వేయనున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా హామ్ పద్ధతిపై బీటీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్‌గా కల్వకుర్తిని ఎంపిక చేసిందని వివరించారు. అనంతరం ఖానాపూర్ గ్రామంలో మృతిచెందిన జంగమ్మబాయి కుటుంబ సభ్యులు శరణయ్య, శివాజీలను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో తలకొండపల్లి తహసీల్దార్ నాగార్జున, ఎస్ఐ శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ అజీం, నాయకులు రఘురాములు, ఆరిఫ్, డేవిడ్, రాజేందర్‌నాయక్, శ్రీనివాస్, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

యాచారం: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనువాస్‌రావు సూచించారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సీనియర్లకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠశాల, కళాశాల విద్య రెండు కళ్లలాంటిందని, ఈ సమయంలో ఎంతో ఉన్నత లక్ష్యంతో చదువుకుంటే గొప్ప వ్యక్తులుగా మారుతారని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే.. జీవితంలో ఎంతో కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పరీక్షల సమయం దగ్గరపడుతుందని, శ్రద్ధగా విద్యనభ్యసించి, వంద శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి, భవాని, మృత్యుంజయ, గీత, నరేందర్‌రెడ్డి, రవి, ఆనంద్, శ్రీచరణ్, వసంత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మాడ్గుల: గ్రామ దేవతలు సంప్రదాయలకు గౌరవం అని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. శనివారం మండల పరిధి కలకొండ గ్రామంలో చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి.. దేవతామూర్తులను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి నాయకుల పరామర్శ

కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన బోసు రాఘవేందర్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. వైద్య చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధితున్ని పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, మల్లేశ్‌గౌడ్, సత్యం యాదవ్, రవి, యాదయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధి 163 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేశారు. పెద్దఅంబర్‌పేట ఇందిరా గార్డెన్‌లో తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రూ.1.64 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో తిరుగులేని భారతి సిమెంట్



తాపీ మేస్త్రీకి గోడ గడియారం బహూకరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: సిమెంట్ వ్యాపారంలో, నిర్మాణ రంగంలో తిరుగులేని శక్తి భారతి సిమెంట్ అని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం అరవింద్ స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్ సిమెంట్ మార్కెట్‌లోకి వచ్చిందని, ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాల వేగవంతంగా పూర్తవుతుందని వెల్లడించారు. సిమెంట్ వినియోగదారులకు ఉచితంగా సాంకేతిక సహాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రిట్ నిర్మాణ సమయంలో సంస్థ నిపుణులైన ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయ పడతారని పేర్కొన్నారు. మిగతా సిమెంట్ బస్తాతో పోలిస్తే రూ.20 ఎక్కువగా ఉంటుందని తెలిపారు. డీలర్ అరవింద్ యాదవ్ మాట్లాడుతూ భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్టుగా ఉందన్నారు.

ఏం జరిగినా.. సమాచారం ఇవ్వండి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధి గ్రామాల్లో ఏదైనా చిన్న సంఘటన జరిగిన వెంటనే సమాచారం ఇవ్వాలని, తక్షణమే బాధితులకు న్యాయం చేస్తామని సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. శనివారం నక్కర్తమేడిపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త వ్యక్తుల సంచారం, చోరీలు, గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు ఇలా ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం నక్కర్తమేడిపల్లి– పల్లెచల్కతండా రోడ్డుపై వాహనాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజం రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వరూప

ఆమనగల్లు: మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కాటం స్వరూప సూచించారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో పోలీసు కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. రాజీయే రాజమార్గమని, లోక్ అదాలత్‌లో కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని కేసులను పరిష్కరించుకోవాలని చెప్పారు. పోలీసులు రాజీద్వారా పరిష్కారమయ్యే కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి మాట్లాడాలని సూచించారు. సమావేశంలో ఏపీపీ కార్తీక్, ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, వేణుగోపాల్, ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాయక్, ఆమనగల్లు, తలకొండపల్లి ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్ తదితరలు పాల్గొన్నారు.

లోతుగా అధ్యయనం చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను తెలుసుకుంటూ, ఎప్పటికప్పుడు లోతుగా అధ్యయనం చేయాలని ఐఐటీ ఆర్‌కే వ్యాలీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా విద్యార్థులకు సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 'రెన్యూబుల్ ఎనర్జీ, గ్రీన్ కంప్యూటింగ్, సస్టైనబిలిటీ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ కండెన్స్‌డ్ బయోగ్యాస్ ఆధారిత శక్తి ఉత్పాదక కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. పునరుత్పాదక రంగానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకుని, కాలుష్య రహిత దేశంగా తీర్చిదిద్దడానికి తోడ్పడాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామమోహన్‌రెడ్డి, అకాడమిక్ డీన్ నయనతార ఉన్నారు.

25న ఆరు గ్యారంటీలపై సమీక్ష

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలపై ఈ నెల 25న ఇబ్రహీంపట్నం మండల అధికారులతో సమావేశం నిర్వహిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. అధికారుల సమీక్షలో.. రేషన్‌కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళల ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా తదితర పథకాల అమలు తీరుతెన్నులను పరిశీలిస్తామని తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాష

ఆమనగల్లు: పట్టణంలోని 9వ వార్డు విద్యానగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఆ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ఎ.పాష కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌కు ఉపాధ్యక్షుడు శేఖర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. సీసీరోడ్లు, మురుగు కాల్వలు నిర్మించాలని, ఇళ్లపై నుంచి ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ మార్చాలన్నారు.



వైద్యులు దైవంతో సమానం

- నిస్వార్థంగా వైద్య సేవలు అందించాలి
- పట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పిస్తాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- బస్తీ దవాఖానాలు ప్రారంభం



ఖానాపూర్‌లో బస్తీ దవాఖానలో వైద్యురాలు కీర్తనను సీట్లో కూర్చోబెట్టిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఆపదలో ప్రాణాలు కాపాడే వైద్యులను ప్రజలు దైవంగా భావిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పేదలకు నిస్వార్థంగా వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధి ఇబ్రహీంపట్నం, ఖానాపూర్‌లో బస్తీ దవాఖానాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులకు అధికశాతం పేదలే వస్తారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యశాలల్లో సిబ్బంది, మందుల సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పట్నం ధర్మాసుపత్రిలో సౌకర్యాలు లేక రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని, ఆ ఆస్పత్రిని మెరుగు పర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌తో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తన దృష్టికి వచ్చిందని, రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధి

ప్రత్యేక ప్రణాళికతో నియోజకవర్గంలోని 73 గ్రామ పంచాయతీల పరిధిలో 181 కిలో మీటర్ల మేర 60 రోడ్లను మూడేళ్ల కాలంలో పూర్తి చేయనున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి తెలిపారు. రూ.60 కోట్లతో స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి నాగన్‌పల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణం, రూ.2 కోట్లతో ఖానాపూర్ నుంచి మంగల్‌పల్లి వరకు ఉన్న బైపాస్ మట్టి రోడ్డును బీటీగా మార్చే పనులను త్వరలో చేపడతానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, మాజీ వైస్ చైర్‌పర్సన్ బర్ల మంగ, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, అర్బన్ హెల్త్ ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ వినోద్, ప్రోగ్రాం హెల్త్ ఆఫీసర్ అక్రం, ఎన్‌యూహెచ్ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధామాధవి, లోకల్ మెడికల్ ఆఫీసర్స్, సరిత, బస్తీ దవాఖాన వైద్యులు, కీర్తన, అఖిల్, మాజీ కౌన్సిలర్లు మమత, బానుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి కృషి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రూ.10 కోట్లతో ఆదిబట్ల మున్సిపాలిటీ చింతపల్లిగూడ గేటు నుంచి రాందాస్‌పల్లి మీదుగా బ్రహ్మణపల్లి వరకు రోడ్డు విస్తరణ, నూతన రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్డు అభివృద్ధి ద్వారా 11 కిలో మీటర్ల రోడ్డుకు మోక్షం కలుగుతుందని, తద్వారా రవాణా సౌకర్యం మెరుగు పడనుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు నెలల్లో పనులు పూర్తి కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకా మధుసూదన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ పురపాలిక అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, నాయకులు దాసు, అశోక్, సురేష్, రమేష్, భిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- విద్యాధికారికి వినతిపత్రం అందజేత
- రేపు మధ్యాహ్న భోజనం బంద్



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

యాచారం: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లుల ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పథకం సిబ్బందితో కలిసి మండల విద్యాధికారి పాండు రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బిల్లులు సకాలంలో చెల్లించని కారణంగా నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నిరసనగా.. ఈ నెల 24న పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వండటం లేదని, కలెక్టరేట్ ఎదట ధర్నా చేయనున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఆదేశాలు జారీ చేస్తారని, కానీ బిల్లులు మాత్రం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నాణ్యతగా లేవని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భోజన తయారీ సిబ్బందికి నెలకు రూ.10 వేల వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భోజన సిబ్బంది అంశమ్మ, నరసమ్మ, నాగమ్మ, శిల్ప, లక్ష్మమ్మ, దుర్గమ్మ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

యాచారం: మండల పరిధి నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు విరాళం అందజేశారు. 1999– 2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన బాల్య మిత్రులు.. శనివారం హెచ్ఎం ఉదయశ్రీకి రూ.37 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, తదితర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోజయ్య, అంజయ్య, నరేందర్‌రెడ్డి, రాజు, కొండల్‌రెడ్డి, శ్రీశైలం, రాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.